# మాట దక్కదు మరి

కుడిచేత్తో నుదుట పట్టిన చెమట తుడుచుకుంటూ, బెంచీ చివర ఎలాగో కాస్త జాగా సంపాదించుకుని, ఉస్సురంటూ కూలబడ్డాడు వెంకటప్పయ్య.

ఎడం చెయ్యి కోటు జేబులోంచి తియ్యటానికి వల్లకాదు మరి. దాని గుప్పెట్లో ఓ పది రూపాయలనోటూ కాస్త చిల్లరా ఉన్నాయి.

ఈ రష్‌లో అదెవడైనా కొట్టేస్తే, వచ్చిన పని అవడం మాట దేవుడెరుగు, తనఊరికి లెఫ్ట్ రైట్ కొట్టెయ్యవలసిందే! పెద్దప్రాణం దడదడ లాడి పోతోంది. ఇంతకీ ఈ నీరసం వేళకి తిండి పడకపోవడంచేత ఏర్పడ్డదేనా? జవాబుగా ఇటు నవ్వూ అటు దగ్గూ కానిదేదో అతని నోటి నుంచి బయటకొచ్చింది. ఇంట్లో ఉంటే ఈ వేళప్పుడు ఆ చేసే ఒక్క పూట భోజనం కానిస్తే మాత్రం ఏ పడక్కుర్చీలోనో కాస్సేపు మేను జారేసే అదృష్టమేది తనకి? ఇది లేదు అది లేదని యింట్లోది గుర్తు చెయ్యనక్కరలేదు. అప్పులాళ్ళు ఎవరూ తన వీధి తలుపు తట్టనక్కర లేదు. చిల్లర బాకీలే ఉన్నాయి వెయ్యి పైమాటగా అని జోరీగలా రొద చెయ్యడానికి తన మనసు చాలు. అంతటి బరువు నెత్తిమీద తంతూండగా యిక విశ్రాంతి అనగా ఎలాంటిది? అయినా ఎవరు మాత్రం ఎన్నేళ్ళు ఓపిక పడతారు! ఈ కొట్టిన రిమైండర్సన్నీ ఏ గంగలో కలిశాయో! ఇప్పటికైనా తన పెన్షన్ కాగితాలు శాంక్షనై - ఇంక నెలకైనా తన డబ్బులు తన చేతిలో పడతాయోలేదో? ఆ ట్రెజరీ ఆఫీసరు మహాను భావుడు తనలాంటి సామాన్యులకి ఇవాళైనా దర్శనం యిస్తాడో లేదో... ఈ బంట్రోతు పూజారి తన కాగితం అందజేశాడో లేదో - శ్రమపడి స్వయంగా వచ్చినా తన పని అవుతుందోలేదో-కాఫీ తాగివద్దాం పదమని

కడుపు గగ్గోలు పెడుతున్నా ఈలోగా వాడు కబురుతెచ్చి ఎక్కడ పోతాడో అని అలాగే ఉగ్గబట్టుకుని అక్కడే ఉండిపోయాడు అతను.

తన పేరు ఎవరో పిలిచినట్లై ఉలిక్కిపడి లేచాడు వెంకటప్పయ్య. పిలిచినవాడు ప్యూనేకాని వాడు ట్రెజరీ ఆఫీసులోంచి రాలేదు. ఎదుటి వింగ్‌లో వున్న కలెక్టరాఫీసు నుంచి వాడిరాక. మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు. అంటే ఆశ్చర్యంగా వాణ్ని అనుసరించాడు. వాడు ఆయన్ని అలా తీసుకెళ్ళి తీసుకెళ్ళి ఓ లోపల రూమ్‌లో ఓ ఫేన్‌కింద ఓ కుర్చీలో కూచోబెట్టి వెళ్ళిపోయాడు. టేబుల్‌కి అవతల కూర్చున్న ఆఫీసరు లాంటివాడులేచి నమస్కారం మాష్టారూ.... నేను కలెక్టరుగారి పియ్యేని.... మీరు లేవకండి .... పెద్దవారు - కూర్చోండి అని కూర్చోబెట్టేశాడు. హఠాత్తుగా వచ్చిన యీ పదవికి మూలమేమిటో వెంకటప్పయ్యకి బోధ పడకుండానే పియ్యే కాఫీ టిఫినూ తెప్పించాడు. కడుపు యింకా నిండ కుండానే కడుపు నిండిపోయే కబురు చెప్పాడు. కలెక్టరుగారు వెంక టప్పయ్య దగ్గిర చదువుకున్నాడట. అతన్ని ఇందాక కార్లోంచి వెడుతూ తొందర్లో చూశారుట. అయినా అవునో కాదో అని ట్రెజరీ ఆఫీసుకి ఫోన్ చేసి కాగితాలు తెప్పించి వెరిఫైచేసి నిజం తెలుసుకున్నారుట. దగ్గిరుండి అప్పటికప్పుడు శాంక్షన్ చేయించారుట. వెంకటప్పయ్య యింటికి వెళ్ళే ముందుగానే ఆ కాగితాలు అక్కడికి చేరి ఉంటాయిట. ఆయనకి అవాళ చాలా బిజీ డేటట. అయినా మధ్యాహ్నం భోజనానికి బంగళాకి వెళ్ళే టప్పుడు కార్లో అతన్ని తీసుకువెళతాడనీ అప్పటిదాకా ఆయన ఆతిధ్యపు బాధ్యత పియ్యేకి అప్పచెప్పేరుట.

ఎదురు చూడని అంతటి మధురానుభూతికి ఆ అర్భకప్రాణి తట్టుకోలేకపోయాడు. తింటూ తింటూన్న ప్లేటులోనే చెయ్యి కడిగేసు కున్నాడు. లేచి నిలబడిపోయాడు. "కడుపులో అదోలా ఉంది. ఓ సోడా కాయ తాగివస్తా" అన్నాడు. "అయ్యో ఆ మాత్రం దానికి మీరు లేవాలా, కావాలంటే మాత్రా, కూల్‌డ్రింకూ నేను తెప్పించనూ, ఇదిగో .... ఏవోఁయ్ రవణా" అని పియ్యే అంటూంటే లేదండీ.... పొద్దుటే ఓసారి అలా తిరిగిరావడం నాకు అలవాటు. ఇవాళ అది కుదరక ఏదోలా ఉంది.

అలా నాలుగడుగులు వేసివస్తే సర్దుకుంటుంది. ఓ అరగంటలో వచ్చేస్తాగా!" అని బయలుదేరిపోయాడు. ఫ్యాన్‌ని పంపిస్తానన్నా వద్దని కొట్టిపారేశాడు.

వెంకటప్పయ్య ఆ పెద్ద ఆవరణలో ఆలోచిస్తూ ముందుకి అడుగులు వేశాడు. పైకి వినయం నటించి ఎంత అణగదొక్కాదామని ప్రయత్నించినా అతనిలోని ఉక్కిరిబిక్కిరికి కిక్కురుమనకుండా ఎందుకు పడి ఉండాలో బోధపడలేదు. ఎందుకూ పనికిరాని బడిపంతులు బతుకు అనుకుంటారు కాని ఈ నాడు ఎంత పెద్ద ఆఫీసరుగా పని చేసినా ఓ నాడు యితనిచేత అక్షరాలు దిద్దించిన ప్రత్యేకమైన ఖ్యాతి ఎవరిది? ఇంతకంటె మరి పెద్దపదవి లేదు అనిపించుకునే జిల్లా కలెక్టరుకే తను గురువు. పెద్ద గాలి వీస్తే పాకలూ, పందిళ్ళూ పడిపోతాయి. భూకంపమే వస్తే మేడలూ, మిద్దెలూ నేలమట్టమౌతాయి. ఈ పాడు ప్రపంచంలో ఏది శాశ్వతం? ఒక్కణ్ని ఉన్నతోన్నతుణ్ణి చేశామనే చిన్న తృప్తి చాలదా!

"మేష్టారూ. మేష్టారోయ్.... మిమ్మల్నే....కాస్త ఆగండి బాబూ!" తుళ్ళిపడి వెనక్కి తిరిగి చూశాడు.

"చేతులకి వేశారుగాని బేడీలు మూతికి కాదుగా....ఎన్నేళ్ళో అయిపోయింది మా గురువుగార్ని చూసి, కాస్త మాట్లాడుకోనివ్వండి మరి...."

అటూ ఇటూ ఇద్దరు పోలీసుల మధ్య ఓ నడివయస్సు రౌడీ అప్రయత్నంగా నిలబడిపోయాడు. వెంకటప్పయ్యతో వాడికి కాస్సేపు మాట్లాడ్డానికి అవకాశమిచ్చారు పోలీసులు. ఆ కాసేపూ ఫుల్‌స్టాపూ, కామా లేకుండా అలా వాగుతూనే ఉన్నాడు వాడు. ఎన్ని అడిగేడో ఎన్ని చెప్పేడో యింక అంతూ దరీ అంటూలేదు. ఎన్నాళ్ళ నుంచో ఎరిగున్న మనిషి ఎంతో ఆప్యాయంగా పలకరించిన అనుభూతి కలిగి నోట మాటరాలేదు వెంకటప్పయ్యకి.

"పద. పద. ఎంతసేపు వాగుతావు? ఎంతసేపూ నువ్వు అరిచి చావడమేగాని ఆ అయ్యగారి నోట ఒక్కముక్క ఊడిపడదే? ఇంతకీ ఎవర్ని చూసి ఎవరనుకున్నావో? నీకా అయ్యగారు చదువు చెప్పేరో లేదో?"

"ఊరుకోవయ్యా మా గురు శిష్య సంబంధం అదెంత గొప్పదో నీకేం తెలుసు?"

"తెలుస్తూనే ఉందిగా! నిన్నిలా తయారుచేసినందుకు ఆ అయ్య గార్ని మెచ్చుకోవాలి!"

అందరూ నవ్వేరు. ఒక్కమారు అయిన అంత పెద్ద శబ్దంవల్ల తప్ప తెలియలేదు, ఎంతమంది తనచుట్టూ మూగేరో. అందరూ తన్నే, గుచ్చిగుచ్చి చూస్తున్నట్లై ఎంతో సిగ్గనిపించింది వెంకటప్పయ్యకి. వాడికి మాత్రం చీమ కుట్టినట్టులేదు.

ఇంకా నన్ను జైల్లో పెట్టడంలేదు మాష్టారూ, విచారణ పూర్తి కాలేదులెండి. అందాకా లాకప్‌లో ఉంచుతారని మీకు తెలుసుగా? అది ఎక్కడో దూరం కాదులెండి. ఇక్కడికి మహా వుంటే రెండు ఫర్లాంగు లుంటుంది. నిక్షేపంగా మనిషిని చూస్తూ మాట్లాడుకోవచ్చు .... గొప్ప సదుపాయం! మీరు ఒక్క భోగట్టా చెప్పలేదు. ఎన్నాళ్లై చూశానో మిమ్మల్ని! తప్పకుండా వస్తారుగా! ఆ కటకటాలు పట్టుకుని అలా మీ కోసం ఎంతసేపైనా చూస్తూ ఉంటాను ?"

పోలీసులు లాగేశారు. వాడు వెళ్ళిపోయాడు. కాని వాడి చూపులూ, మాటలూ, వెంకటప్పయ్యని ఎప్పటికీ ఒదిలేలా కనిపించలేదు!

వరండామీద స్తంభాన్ని జారపడి కూచుండిపోయాడు వెంకటప్పయ్య. కలెక్టరుదిగాని, కాబోయే ఖైదీదిగాని పేరేనా తెలుసుకోనందుకు ఆశ్చర్యపోయాడు అతను. కాని తెలుసుకోవలసిందీ గుర్తుపెట్టుకో వలసిందీ రూపంగాని, పేరుకాదు. కలెక్టర్ని తను చూడలేదుగాని ఖైదీగాడు అనుమానం లేకుండా తన శిష్యుడే. కారులో కలెక్టరు బంగళాకి వెళ్ళేందుకు తను సిద్ధమైతే అంతకుముందు కాలినడకని కటకటాల కొట్టుకు వెళ్ళి తీరవలసిందే. గుండె దడదడలాడి నిలబడిపోయాడు వెంకటప్పయ్య. గబగబా బస్‌స్టాండ్‌వైపు కదిలిపోయాడు.

ఇల్లు చేరుకున్నాడు గాని అనుకున్నపని అతిసుళువుగా పూర్తయిందనే సంతృప్తి మిగల్లేదు అతనికి. 'వీడెవరనుకున్నారు. నా శిష్యుడే సుమా!' అని సాటి మేష్టరెవరైనా తమ గత ప్రజ్ఞలు చెప్పుకోబోతే మాత్రం నీరసంగా నవ్వుకుంటాడు.